క్లుప్తంగా...

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం


కుట్టు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

అఫ్జల్‌గంజ్: మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సత్య సాయి సేవా సంస్థలు, కోఠి సమితి కన్వీనర్ విశ్వేశ్వరశాస్త్రి తెలిపారు. మంగళవారం తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 17 బ్యాచుల ద్వారా దాదాపు 400 మంది ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. 18వ బ్యాచ్‌ను మంగళవారం ప్రారంభించామని 100 రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో లేదా 88865 09410 లో సంప్రదించాలని సూచించారు.

'నందకిషోర్‌కు టికెట్ ఇస్తే గెలిపించుకుంటాం'

నాంపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కో ఇన్‌చార్జి చిలకల నరేందర్ మాదిగ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆగాపురలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నందకిషోర్ వ్యాస్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడని ప్రశంసించారు. రాబోయే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నందకిషోర్ వ్యాస్‌కు పార్టీ టికెట్ కేటాయించాలని సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మహమ్మద్ మహమూద్ అలీకి విజ్ఞప్తి చేశారు. నంద కిషోర్ వ్యాస్‌కు టికెట్ కేటాయిస్తే గోషామహల్‌లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమైనట్లేనని అన్నారు.

రూ.2వేల నోట్ల రద్దుతో బంగారు షాపులకు పెరిగిన గిరాకీ


సిద్దంబర్ బజార్‌లో బంగారు షాపులు

అఫ్జల్‌గంజ్: రూ.2వేల నోట్లను ఆర్బీఐ రద్దు చేయడంతో ప్రజలు బంగారు షాపులకు క్యూ కట్టారు. బ్యాంకులో ఒకసారి కేవలం రూ.20 వేల మార్పిడి అవకాశం ఇవ్వడంతో జనం తమ రూట్లను మార్చుకున్నారు. బ్యాంకుల వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకొని బంగారు కొనుగోలు చేయడంపై ఆసక్తి చూపిస్తున్నారు. సెప్టెంబర్ చివరి వరకు అవకాశం ఉన్నా ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. బంగారం కొంటే ఎలాంటి ప్రమాదం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. బంగారు భవిష్యత్‌లో మంచి పెట్టుబడిగా పనికి వస్తుందంటున్నారు.

ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి


ముజీబ్‌ను సన్మానిస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని అప్పుడే సమస్యల పరిష్కారానికి పోరాటం చేయగలమని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం.ముజీబ్ హుసేని అన్నారు. మంగళవారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ విజయలక్ష్మి, విద్యాశాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్జీఓస్ నగర కార్యదర్శి విక్రమ్‌కుమార్, పాఠశాల విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గురునాథ్ నాయక్



అబిడ్స్: గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కె.గురునాథ్ నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సర కాలం పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి షీ టీమ్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో మొగల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వహిస్తున్న కె.గురునాథ్ నాయక్‌ను పోలీస్ కమిషనర్ నియమించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన గురునాథ్ నాయక్ గతంలో నిజామాబాద్, బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారుల సూచనల మేరకు ట్రాఫిక్ కంట్రోలింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించేందుకు, అక్రమ పార్కింగ్‌లను నిరోధించేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా ఎస్ఎండీపీ అధికారులతో కలిసి టోలిచౌకి డివిజన్‌లో పర్యటించారు. ముందుగా టోలిచౌకి డివిజన్ బాల్‌రెడ్డినగర్‌లో అసంపూర్తిగా ఉన్న బాక్స్‌టైప్ పనులను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం బాల్‌రెడ్డి నగర్ ముంపునకు గురైందని, అధికారులు పనులను మాత్రం నింపాదిగా చేస్తున్నారని ఆయన అన్నారు. అదే విధంగా విరాసత్‌నగర్‌లో కూడా ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చిందని, ప్రజలు వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నా కూడా అధికారులు కళ్లారా చూసి పట్టించుకోవడం లేదన్నారు. టోలిచౌకి డివిజన్ గత సంవత్సరం ముంపునకు గురైనపుడు స్వయంగా బల్దియా ఉన్నతాధికారులు ఈ కాలనీలో పర్యటించి వెళ్లారని, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం నదీమ్ కాలనీలో సహాయక చర్యలను పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చొరవ వల్లే బాల్‌రెడ్డి, విరాసత్ నగర్‌లకు బాక్స్‌టైప్ డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయన్నారు. సంవత్సరం కావస్తున్నా అవి పూర్తికాకపోవడం, కాంట్రాక్టర్ల, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. పనుల్లో వేగం పెంచి డ్రైనేజీల పొడవునా ఉన్న మట్టి, వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆయన సూచించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి కార్పొరేటర్ మహ్మద్ హారూన్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి


బల్దియా ఎస్ఈ సహదేవ్ రత్నాకర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫరాజ్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించి కొత్త పనులు ప్రారంభమయ్యేలా చూడాలని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా సూపరింటెండింగ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. అంతేకాకుండా ప్రస్తుతం జరుగుతున్న పనులను వెంటనే పూర్తి చేయించాలన్నారు. తాను గతంలోనే షేక్‌పేట్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల బస్తీలు, కాలనీలను గుర్తించి ఆ జాబితాను అధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ ప్రాంతాల్లో వర్షపునీరు ఆగకుండా గుంతలను పూడ్చాల్సిన అవసరం ఉందన్నారు.

గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధి విభజన

గోల్కొండ: కొత్తగా ఏర్పడుతున్న పోలీస్‌స్టేషన్లతో గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో సగం వరకు కొత్తగా ఏర్పాటైన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కలిపారు. పోలీస్‌స్టేషన్ల పునర్ విభజన, కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుతో పోలీస్‌స్టేషన్ల పరిధులను కూడా విభజించారు. గతంలో గోల్కొండ, టోలిచౌకి, షేక్‌పేట్ తదితర ప్రాంతాలు గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండేవి. అయితే కొత్తగా ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కావడంతో షేక్‌పేట్ డివిజన్‌లోని బస్తీలు, కాలనీలను ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేర్చారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. వైద్య విధాన పరిషత్ యాకుత్‌పురా-1 యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం రెయిన్‌బజార్ మదీనానగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరానికి హాజరైన రోగులకు సాధారణ చికిత్సలతో పాటు కంటి, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం నియోజకవర్గంలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు వైద్యశాఖ అధికారులతో చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఆయోషా ముద్దాషిర్, డాక్టర్ షాఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పారదర్శకంగా ఉండాలి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు జీవన్ సింగ్

గోల్కొండ: ఓటరు నమోదు కార్యక్రమం పారదర్శకంగా ఉండాలని బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవన్ సింగ్ అన్నారు. మంగళవారం మొఘల్‌ఖ నాలా వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కలిగించాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎన్నికల అధికారితో పాటు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లి ఐటీఐలో బోనాల సంబురాలు


అమ్మవారికి బోనాలు సమర్పించిన ఉద్యోగులు

విజయనగర్‌కాలనీ: మల్లేపల్లి ఐటీఐలో ఉద్యోగులు మంగళవారం బోనాల పండుగ సంబురాలు నిర్వహించారు. ఐటీఐ ప్రాంగణంలో నెలకొన్న పెద్దమ్మ తల్లి ఆలయానికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి శిక్షణశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శిక్షణాధికారులను రెగ్యులరైజ్ చేసేందుకు సీఎం కేసీఆర్ సముఖత వ్యక్తం చేయడంతో తాము అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి తమను రెగ్యులరైజ్ చేసినందుకు తాము తమ శక్తి వంచన లేకుండా విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన శిక్షణను అందించి ఉత్తీర్ణత శాతాన్ని నూరు శాతం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ పి.జ్యోతిరాణి, శివనాయక్, నాగరాణి, బాలవర్థి రాజు తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజాన్ని ఆకాంక్షించిన సాహితీవేత్త విశ్వనాథరెడ్డి

రాయదుర్గం: సమ సమాజాన్ని ఆకాంక్షించిన సాహితీవేత్త ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కేతు విశ్వనాథరెడ్డి సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన సంతాపసభలో ఆయన మాట్లాడుతూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కథలు వ్రాయడం, కంటే ముందు వేర్లు, బోధి నవలలను రాశారని గుర్తు చేశారు. తెలుగు విభాగం ఆచార్య గోనానాయక్ మాట్లాడుతూ కింది వర్గాలవారిని ఎంతగానో ప్రోత్సహించే వారని అన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు విజయలక్ష్మి, డాక్టర్ భూక్యాతిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి విజయకుమారిలు విశ్వనాథరెడ్డి సేవలను కొనియాడారు.

ఓటర్ల నమోదు ప్రక్రియ ఇంటింటా చేపట్టండి


బీఎల్‌ఓల సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా తయారీని ఇంటింటా తిరిగి అధికారులు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని 235 పోలింగ్ బూతులలో బీఎల్‌ఓలు ఇంటింటా ప్రతిరోజూ పర్యటించి అర్హులైన వారి ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. మంగళవారం జరిగిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా తయారీ, కొత్త ఓటర్లకు అవగాహన కల్పించడం, అడ్రస్సులు మారిన వారి పేర్లు తొలగించడం తప్పొప్పులను సరిదిద్దడం వంటి ప్రక్రియలన్నీ బీఎల్‌ఓలు బస్తీలు, ప్రాంతాల్లో పర్యటించి విజయవంతంగా చేపట్టాలన్నారు. బీఎల్‌ఓల పాత్ర ఓటర్ల నమోదులో ఎంతో కీలకమన్నారు. ప్రతి భవనాన్ని, అధిక ఓటర్లు ఉన్న ఇళ్లల్లో, కాంప్లెక్సులు, బహుళ అంతస్తులు, బహుళ అంతస్తులలో బీఎల్‌ఓలు చిరునామాలా ప్రకారం.. పర్యటించి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి.. డివైడర్‌ను ఢీకొని..

రాయదుర్గం: అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యూసుఫ్‌గూడలో నివాసముంటూ నానక్‌రాంగూడ కారు వాష్‌సెంటర్‌లో పని చేస్తున్న చింటు(20) అనే యువకుడు సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో విధులు ముగించుకొని బోరబండకు వెళుతూ నానక్‌రాంగూడ ఔటర్ రింగురోడ్డు సర్వీస్ రోడ్డుపై ముందు వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సెయింటాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ పుష్ప మేరి అన్నారు. ఆసిఫ్‌నగర్ సెయింటాన్స్ పాఠశాలలో గత నెల 26న ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. స్కేటింగ్, క్లాసికల్ డ్యాన్స్, కరాటే, బాస్కెట్‌బాల్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ తదితర అంశాల్లో నెలరోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులు తమ ప్రతిభను చాటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


నాంపల్లిలోని హజ్రత్ షా ఖామూష్ దర్గా వద్ద ఉర్సు ఉత్సవాలు

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న సదానందరెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని ఈనెల 24న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కులోని ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షుడు సదానందరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న నిర్వహించే నిరాహార దీక్షకు విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు, మేధావులు, కవులు, కళాకారులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉచిత విద్య వైద్య సాధన సమితి అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్, నర్సింహాగౌడ్, వెంకటేశ్వర్, ధానమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలి


మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

సుల్తాన్‌బజార్: న్యాయవాదులపై దాడుల నివారణకు న్యాయవాదుల సంరక్షణ చట్టం తీసుకురావాలని బార్‌కౌన్సిల్ సభ్యులు కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భారత ప్రజా న్యాయవాదుల సంస్థ, లాయర్స్ కౌన్సిల్ పౌరహక్కుల సంఘం, పీయూసీఎల్, బార్‌కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు. ఇటీవల నల్గొండ జిల్లా తిరుమలగిరిలో యువ న్యాయవాది యుగేందర్‌పై స్థానిక ఎమ్మెల్యే అనుచరులు దాడిచేశారని ఆరోపించారు. అలాగే మరో ఘటనలో చర్లపల్లి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ అనే జైలర్ న్యాయవాది డి.సురేష్‌కుమార్‌పై నిందపూర్వకంగా పత్రికా ప్రకటన ఇవ్వడాన్ని ఆయా సంఘాల నాయకులు ఖండించారు. ఈ సమావేశంలో సైదారావు, ఉపాధ్యక్షుడు వెంకన్న, నారాయణరావు, విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హుక్కా పార్లర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి

16 మంది అరెస్టు

నాంపల్లి: హబీబ్‌నగర్‌లో ఓ హుక్కా పార్లర్‌పై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. హుక్కా పార్లర్‌లో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందితో పాటుగా హుక్కా సేవించడానికి వచ్చిన 13 మంది వినియోగదారులను అరెస్టు చేశారు. హుక్కా పార్లర్ నిర్వాహకుడు పరారు అయ్యాడు. ఈ దాడిలో రూ.8,800 నగదుతో పాటుగా వివిధ రకాల నికోటిన్ రుచులను సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం పట్టుబడిన నిందితులను హబీబ్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫియన్ దర్గా ఎక్స్ రోడ్డు సమీపంలో హోటల్ మెరీడియన్ పార్క్ పైన దుబాయ్ షీషా లాంజ్ శైలిలో తలాబ్ కట్టకు చెందిన ఇమ్రాన్ ఒక హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారు. మొగల్‌పురా వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసం ఉండే మహ్మద్ అక్బర్ కుమారుడు మహ్మద్ సుల్తాన్(29), చార్మినార్‌కు చెందిన షేక్ మగ్దూమ్ కుమారుడు షేక్ ఎజాజ్(21), ఫలక్‌నుమా ఎస్.ఎస్.కుంట ప్రాంతానికి చెందిన షేక్ సబీర్ కుమారుడు షేక్ సజీద్(21) హుక్కా సెంటర్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. హుక్కా పార్లర్ నిర్వాహకుడు ఇమ్రాన్ చట్ట విరుద్ధంగా వినియోగదారులకు హుక్కా కుండలను అందజేస్తున్నారు. నికోటిన్ రుచులను కుండల్లో కలిపి అధిక ధర వసూలు చేయడం ద్వారా అక్రమ లాభాలు పొందుతున్నారు. విశ్వాసనీయ సమాచారంపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం హుక్కా సెంటర్‌పై దాడి చేశారు. హుక్కా పార్లర్‌లో పనిచేసే సిబ్బందితో పాటుగా 13 మంది వినియోగదారులను అరెస్టు చేశారు. వీరిలో కొందరు మైనర్లు కూడా ఉన్నారు. హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు కరువు


శిక్షణ ఇస్తున్న కోచ్‌లు శ్రీశైలం, సత్యనారాయణ

గౌలిపురా: గౌలిపురాలోని ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారుల సౌకర్యార్థం కనీస వసతులు కరువయ్యాయని కోచ్‌లు శ్రీశైలం, సత్యనారాయణలు అన్నారు. ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తాను 20 ఏళ్లుగా పిల్లలకు ఉచితంగా బాస్కెట్ బాల్‌లో శిక్షణ అందిస్తున్నానని.. తాను ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దగా ప్రస్తుతం జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని బాస్కెట్ బాల్ కోచ్ శ్రీశైలం అన్నారు. ఇక్కడ ప్రస్తుతం 25 మందికి పైగా పిల్లలు శిక్షణ కోసం వస్తున్నారని, వారికి సరైన సౌకర్యాలు లేవని.. ఆడుకోవడానికి బాల్స్ సైతం లేవన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కోచ్‌లను సైతం ఎవరిని నియమించలేదన్నారు. ఇక్కడ పిల్లలకు శిక్షణ అందించేందుకు జీహెచ్ఎంసీలో తమకు పార్ట్‌టైమ్‌గా కోచ్‌లుగా అవకాశం కల్పిస్తే ఉపాధి లభిస్తుందన్నారు.

జీసీసీ అక్రమాలపై సంక్షేమ భవనం వద్ద ధర్నా

గోల్కొండ: గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్‌లో భారీ ఎత్తున అవినీతి జరుగుతుందని, దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని లంబాడి హక్కుల పోరాట సమితి గోండ్వాన సంక్షేమ పరిషత్ వారు మంగళవారం మాసబ్‌ట్యాంక్ గిరిజన సంక్షేమశాఖ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక కో ఆర్డినేటర్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ.. జీసీసీ ఆధ్వర్యంలో జరిగే ప్రతి ఆర్థిక విషయాలలో భారీ ఎత్తున అవినీతి చోటుచేసుకుంటుందన్నారు. అటవీ ఉత్పత్తుల అమ్మకాలు, శాఖ అధికారులు, ఉద్యోగులు, గ్రూపులుగా ఏర్పడి అందినకాడికి దోచుకుంటున్నారని, ఇటువంటి విషయాలపై ఎన్నో ఆరోపణలు వచ్చినా కూడా కమిషనర్ పట్టించుకోలేదన్నారు. గతంలో తాను జీసీసీలో అవినీతి అక్రమాలపై సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేశామని, అయితే అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన అన్నారు. భద్రాచలం, గుండాల, పాల్వంచ తదితర గోడౌన్‌లలో నిల్వ ఉన్న రీజనల్ ఉత్పత్తులపై లక్షలాది రూపాయల అవినీతి జరిగిందని ఆయన అన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జి హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ అవినీతిపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, సభ్యులు తదితరులున్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోల్కొండ: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్ అన్నారు. మంగళవారం కార్వాన్ అసెంబ్లీ కోర్ కమిటీ సమావేశం వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతి కూపంలో కూరుకుపోయిందన్నారు. అవినీతి రహిత పాలన అందించడం కేవలం బీజేపీకే సాధ్యమన్న విషయం ప్రజలు తెలిసిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల గోవర్ధన్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, డిజ్వర్ సింగ్, కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టీ. అమర్ సింగ్, ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

పాలాభిషేకం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి రజక ధోబీ అభివృద్ధి సంస్థ పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

అబిడ్స్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి తెలంగాణ రజక ధోబీ అభివృద్ధి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కులవృత్తుల్లో రజక కులస్తులకు లక్ష రూపాయలు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం అభినందనీయమని ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి నినాదాలు చేశారు. మూసీ ఒడ్డున ఉన్న ధోబీఘాట్‌లో రజక సమాజ్ చైర్మన్ లక్ష్మయ్య, కార్యదర్శి సాయిచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ముఖ్యఅతిథిగా హాజరై పాలాభిషేకాన్ని ప్రారంభించారు. అనంతరం బిలాల్ మాట్లాడుతూ.. కులవృత్తులకు లక్ష రూపాయలు ఇస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, సాయిచరణ్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.